నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 21 డిసెంబర్ 2024 | KAMAREDDY

- హామీల అమలుపై నిలదీస్తే చర్యలా?
- ప్రభుత్వంపై మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు
- కేటీఆర్‌పై కేసులను ఖండించిన నాయకులు



కేసులతో గొంతు నొక్కలేరు

వైఫల్యాలను ఎత్తిచూపితే కేసులా?

మోర్తాడ్/భీమ్‌గల్/బాల్కొండ, డిసెంబర్ 20: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే అక్రమంగా కేసులు పెట్టి గొంతు నొక్కాలని చూస్తున్నారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. కేసులు, అరెస్టులతో అసమర్థతను కప్పి పుచ్చుకోవాలనుకోవడం సర్కారు అవివేకమని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తూ పలు మండలాల్లో పార్టీ శ్రేణులు శుక్రవారం నిరసనలు నిర్వహించాయి. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, బాల్కొండ, భీమ్‌గల్ తదితర మండలాల్లో పార్టీ నేతలు విలేకరులతో మాట్లాడుతూ.. సర్కారు తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్న కేటీఆర్‌పై అక్రమంగా కేసులు పెట్టి ఆయన గొంతు నొక్కలేరన్నారు. బీఆర్ఎస్ నేతలపై రేవంత్ సర్కారు కక్షసాధింపుతో వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ నిర్వహణతో తెలంగాణ పేరు ప్రపంచ వ్యాప్తంగా మార్మోగిందన్నారు. కారు రేసింగ్ నిర్వహణలో ఎక్కడా అవినీతి జరుగలేదని, కేటీఆర్‌ను ఎలాగైనా ఇరికించి అరెస్టు చేయాలనే కుట్రతోనే ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టిందని విమర్శించారు. ఈ వ్యవహారంపై దమ్ముంటే అసెంబ్లీలో చర్చిద్దామని కేటీఆర్, బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం ముందుకు రాకుండా పారిపోయిందని ఎద్దేవా చేశారు. అక్రమ కేసులు, బెదిరింపులు, అబద్ధపు ప్రచారాలు ఎన్ని చేసినా భయపడేదే లేదని, కాంగ్రెస్ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని తెలిపారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడం ఆపి, ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

బాల్కొండలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి

మోర్తాడ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, పక్కన జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

కాంగ్రెస్ పతనం షురూ

- హామీలు అమలు చేయలేకే అక్రమ కేసులు
- ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహణ అంతా సవ్యమే
- అడుగడుగునా నిలదీస్తున్నందుకే బీఆర్ఎస్‌పై కక్ష
- కేటీఆర్‌ను అరెస్టు చేయాలన్నదే రేవంత్ లక్ష్యం
- ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి ధ్వజం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 20: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలి పోతాడని, కేటీఆర్‌ను అరెస్టు చేసి శునకానందం పొందాలని చూస్తున్నాడన్నారు. తప్పుడు కేసులతో అరెస్టు చేస్తే తెలంగాణ అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. ఏడాది పాలనతో కాంగ్రెస్ పతనం మొదలైందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రావన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

తెలంగాణ ప్రతిష్ఠను పెంచేందుకే..

హైదరాబాద్‌తో పాటు తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాలనే ఉద్దేశంతోనే ఫార్ములా ఈ కార్ రేసింగ్ నిర్వహణకు కేటీఆర్ కృషి చేశారన్నారు. ప్రపంచంలోనే పేరొందిన ఈ రేసింగ్‌ను తెలంగాణకు తీసుకురావడం ద్వారా ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రోత్సహించడంతో పాటు హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని చెప్పారు. గతంలో ఫార్ములా ఈ కార్ రేసింగ్ నిర్వహించిన లండన్, బ్రెజిల్, మాస్కో వంటి నగరాల సరసన హైదరాబాద్ నిలువడానికి కేటీఆర్ కృషియే కారణమని చెప్పారు. ఈ రేసింగ్‌తో నిర్వాహకుల అంచనా ప్రకారం రూ .750 కోట్ల వ్యాపారం జరిగిందన్నారు.

ఒప్పందం ప్రకారమే..

ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహణ ఒప్పందం ప్రకారమే జరిగిందని, ఇందులో ఎలాంటి అవినీతి లేదని బాజిరెడ్డి అన్నారు. ప్రతి సంవత్సరం రేసింగ్ జరిగి ఉంటే రాష్ట్రానికి లాభాలు వచ్చేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఫార్ములా ఈ రేసింగ్‌ను రద్దు చేసిందన్నారు. పైగా ఇందులో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రూ.55 కోట్లు అధికారికంగా ఇచ్చారని చెప్పారు. ఈ రేసింగ్‌కు సంబంధించి అన్ని పత్రాలు ఉన్నాయని, కానీ ఏదోరంగా కేటీఆర్‌ను జైల్లో వేయాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నాడని ఆరోపించారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే..

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. హైడ్రా వంటి వాటితో కాంగ్రెస్ పరువు పోయిందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేటీఆర్‌పై కేసులు పెట్టారని విమర్శించారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. అబద్ధాలతోనే పాలిస్తున్నాడన్నారు. హామీలు అమలుచేయకుండా పిచ్చి పనులు చేస్తున్నారని, రాష్ట్రాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉండేదని, కాంగ్రెస్ వచ్చాక రాష్ట్రం పరువు తీస్తున్నారని విమర్శించారు. అధికారం ఉంది కదా అని కండ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నారని, ఇదంతా వినాశనానికేనని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హితవు పలికారు. జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు సిర్ప రాజు, శేఖర్, సత్యప్రకాశ్, సుజిత్‌సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై దళిత, అంబేద్కర్ సంఘాల ఆగ్రహం

ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న ఆందోళనలు

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మల దహనం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 20: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ దళిత, అంబేద్కర్ సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఉమ్మడి జిల్లాలో రెండోరోజూ కొనసాగాయి. శుక్రవారం మోర్తాడ్, బాల్కొండ, భీమ్‌గల్, బోధన్, ఏర్గట్ల, ఆర్మూర్, తాడ్వాయి, బీబీపేట్, బాన్సువాడ, బిచ్కుంద తదితర మండలాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. మోర్తాడ్ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించగా..బాన్సువాడలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్‌షా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నిరసనల వెల్లువ

భీమ్‌గల్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘం నాయకులు

అమెరికాలో బోధన్ విద్యార్థి మృతి

బోధన్, డిసెంబర్ 21: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన విద్యార్థి దుర్మరణం చెందాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని రాకాసీపేట్ గౌడ్స్‌కాలనీకి చెందిన శంకర్‌గౌడ్, నీరజ దంపతుల కుమారుడు పంజాల నీరజ్‌గౌడ్ (23) అమెరికాలోని న్యూ హెవెన్ సిటీలో ఎంఎస్ చదువుతున్నాడు. తన స్నేహితుడు శ్రీధర్‌తో కలిసి ఈ నెల 16న బ్రిడ్జిపోర్టు ప్రాంతానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో దట్టమైన పొగమంచు ఆవరించడంతో కారు అదుపు తప్పి పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని దవాఖానకు తరలిస్తుండగా, నీరజ్ గౌడ్ మార్గమధ్యంలో మృతి చెందగా, శ్రీధర్ ప్రస్తుతం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకునే సమయంలో ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి రప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం పునః ప్రారంభించారు

నిజాంసాగర్, డిసెంబర్ 20: నిజాంసాగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని పునః ప్రారంభించారు. తమకు సకాలంలో బిల్లులు రావడంలేదని మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఈ నెల ఒకటో తేదీ నుంచి బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో పాఠశాలలో 15 రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచిపోగా.. విద్యార్థులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నారు. ఈ విషయమై నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 20న 'ఇంటి నుంచే మధ్యాహ్న భోజనం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.రాంచందర్ స్పందించారు. శుక్రవారం మహిళా సంఘాల సభ్యులకు ఏజెన్సీ బాధ్యతలు అప్పగించి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తిరిగి ప్రారంభించారు.

మధ్యాహ్న భోజన వంటను పరిశీలిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

వార్డెన్ బదిలీ..

వంట నిర్వాహకుల తొలగింపు

- పెద్దకొడప్‌గల్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో 'రుచిలేని భోజనం'పై స్పందించిన అధికారులు

విచారణ చేస్తున్న జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 20: పెద్దకొడప్‌గల్ ఎస్సీ బాలుర వసతిగృహంలో గురువారం ఉడికీ ఉడకని అన్నం తినడంతో నలుగురు విద్యార్థులు తీవ్ర కడుపునొప్పితో బాధపడగా ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 20న 'వసతిగృహంలో రుచిలేని భోజనం' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై జిల్లా అధికారులు స్పందించారు. శుక్రవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత హాస్టల్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..వసతిగృహంలో ఉడికీ ఉడకని అన్నం తినడంతో విద్యార్థులు అస్వస్థతకు గురవగా.. విచారణ చేపట్టినట్లు తెలిపారు. కొత్త బియ్యం కావడం, వంట నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఈ ఘటన జరిగిందని చెప్పారు. బియ్యాన్ని బిచ్కుంద ఎంఎల్ఎస్ పాయింట్‌కు మార్చినట్లు తెలిపారు. దవాఖానలో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థులు క్షేమంగా ఉన్నారని చెప్పారు. నివేదిక అందించడంలో నిర్లక్ష్యం వహించిన వార్డెన్ రాజేందర్‌పై చర్యలు తీసుకొని, వేరే హాస్టల్‌కు బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు. వంట నిర్వాహకులను తొలగించి, కొత్త వారిని తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం, రుచి చూసిన తర్వాతే అందించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా అధికారిణి వెంట ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ దశరథ్, ఎస్సై మహేందర్, అధికారులు ఉన్నారు.

ఎస్సైలకు క్రమ'శిక్ష'ణ?

- మీటింగ్‌కు లేట్‌గా వచ్చిన పోలీసులు
- సీరియస్ అయిన ఇన్‌చార్జి సీపీ
- గ్రౌండ్ చుట్టూ ఐదు రౌండ్లు కొట్టించిన వైనం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



వినాయక్‌నగర్, డిసెంబర్ 20: సమావేశానికి ఆలస్యంగా వచ్చిన ఎస్సైలకు మరిచిపోలేని పనిష్‌మెంట్ ఇచ్చారు నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ. పోలీసు గ్రౌండ్ చుట్టూ ఐదు రౌండ్లు రన్నింగ్ చేయించారు. వారం క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అసలేం జరిగిందంటే.. ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ వారం క్రితం జిల్లా పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు సకాలంలో రావాలని సూచించారు. అయితే, నలుగురు ఎస్సైలు సమావేశం ప్రారంభమైన తర్వాత హాల్‌లోకి చేరుకున్నారు. మీటింగ్‌కు ఆలస్యంగా రావడాన్ని సీరియస్‌గా పరిగణించిన ఇన్‌చార్జి సీపీ ఊహించని రీతిలో వారికి శిక్ష విధించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్ చుట్టూ ఐదు సార్లు రన్నింగ్ చేసి రావాలని ఆదేశించారు. వారు పరుగు పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఆర్ఎస్సైలకు సూచించారు. ఇక తప్పదని ఆ నలుగురు ఎస్సైలు గ్రౌండ్ చుట్టూ ఐదుసార్లు రన్నింగ్ పూర్తి చేసి, ఆ తర్వాత సమావేశానికి హాజరయ్యారు. మరోసారి ఇలా చేస్తే సహించేది లేదని ఇన్‌చార్జి సీపీ హెచ్చరించినట్లు తెలిసింది. పోలీసు శాఖలో పని చేసే వారు క్రమశిక్షణతో పాటు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే క్రమశిక్షణ వేటు పడుతుందని స్పష్టం చేసినట్లు సమాచారం.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినూత్న నిరసన

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. ఇందులో భాగంగా శుక్రవారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టగా.. కామారెడ్డిలో మైసమ్మ ఆలయం బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు.

–కంఠేశ్వర్/ కామారెడ్డి, డిసెంబర్ 20

లోపలి పేజీల్లో..

నిజామాబాద్‌లో అర్ధనగ్నంగా మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు